



గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి నమోదవుతున్నాయి. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 39.1, కనిష్ఠం 26.5 డిగ్రీలు, గాలిలో తేమ 24 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.
-సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ)


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | HYDERABAD


## ఏఆర్ డీఎస్పీ ఇంటి ఎదుట భార్య ఆందోళన

తుర్కయంజాల్, ఏప్రిల్ 15: మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పట్టించుకోకుండా విడాకులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తుర్కయంజాల్ సాయి పంచవటి హోమ్స్ కాలనీలోని ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ ఇంటి ముందు ఆయన భార్య జ్యోతి ఆందోళన చేపట్టారు. మెదక్ ఏఆర్ డీఎస్పీ తుర్కయంజాల్ సాయి పంచవటి హోమ్స్‌లోని తన సొంత ఇంటిలో కొద్ది సంవత్సరాలుగా ఉంటున్నారు. రంగనాయక్ దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆయన భార్య జ్యోతి గతేడాది నవంబర్‌లో మిర్యాలగూడ సమీపంలోని తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో నల్గొండ మహిళా పోలీస్‌స్టేషన్‌లో రంగనాయక్‌పై ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారంజ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయక్ ఉంటున్న ఇంటికి వచ్చారు. వీరి రాకను గమనించి..ఇంటిపైకి రాకుండా మెట్ల వద్ద ఉన్న గేటుకు తాళం వేశారు. దీంతో జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయక్ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. 100 నంబర్‌కు డయల్ చేయడంతో ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారి ప్రమేయంతో రంగనాయక్ ఇంటి గేటు తాళాన్ని తీసి భార్యను ఇంటిలోకి రానిచ్చారు.

## కారు.. జోరు




## గులాబీల జెండలమ్మ..

# బీఆర్ఎస్ హోరు

### ఆ పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

### నామినేషన్ల సమయం దగ్గరపడిన వేళ

### క్యాంపెయిన్‌ను ఉధృతం చేసిన పార్టీలు

### బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులపై పెరుగుతున్న వ్యతిరేకత

సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) :పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో కీలక అంకం మొదలు కానున్నది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల దాఖలు ప్రారంభమై.. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే సమయంలో ఆయా పార్టీలు ఇప్పటికే బరిలో నిలిచే అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రచారంలో ముందంజలో ఉన్నది. చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున భారీ బహిరంగ సభ చేపట్టి ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఈ సభతో బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కంకణబద్ధులై ప్రజాక్షేత్రంలో హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలోనే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పార్టీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ మార్నింగ్ వాక్, సమన్వయ సమావేశాలు, బూత్ స్థాయి సమావేశాలతో ఇప్పటికే నియోజకవర్గాన్ని చుట్టేశారు. ప్రధానంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థి పద్మారావు గౌడ్ నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలను పూర్తి చేసి ఇంటింటికీ గులాబీ జెండాతో పాదయాత్రకు సోమవారం శ్రీకారం చుట్టారు. మొత్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులు ఒకవైపు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ..మరోవైపు వీలైనంత త్వరగా ఓటర్లను చేరుకునేందుకు యత్నిస్తున్నారు. బూత్, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో గెలుపు కోసం సమాలోచనలు చేయడం, సాయంత్రం ఏడు తర్వాత ముఖ్య అనుచరుల నివాసాలు, గెస్ట్‌హౌజ్‌లు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాలనీ, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారు.



సోమవారం కూకట్‌పల్లి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

### బీఆర్ఎస్‌కు స్వచ్ఛందంగా మద్దతు..

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు స్వచ్ఛందంగా తరలి వచ్చి బ్రహ్మరథం పడుతుంటే.. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌లపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సికింద్రాబాద్ నుంచి గెలిచి కేంద్ర మంత్రిగా పని చేసిన కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కొమ్ముకాసి సామాన్యుల జీవితాలను ఉక్కిరిబిక్కిరి చేసిందంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఎంపీగా కిషన్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని, ఆయన నియోజకవర్గం సింటెక్స్ ట్యాంకుల ప్రారంభాలు, సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు లిఫ్టులు ప్రారంభించారే తప్ప.. నియోజకవర్గంలో ఒక్క ఫ్లై ఓవర్ కూడా పూర్తి చేయలేకపోయారని మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై ప్రజల కంటే అటు సొంత పార్టీ నాయకులే భగ్గుమంటున్నారు. ఇప్పటికే టికెట్ ఆశించి భంగపడిన బొంతు రామ్మోహన్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో పాటు చాలా కాలంగా పీజేఆర్ కూతురు విజయారెడ్డికి దానం వర్గీయుల మధ్య రాజకీయ విభేదాలు ఉన్నాయి. బీఆర్ఎస్‌లో ఉన్నంత కాలం దానం తన రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నారనే ఆవేదనతోనే విజయారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. మళ్లీ దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరికతో నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. దానం నాగేందర్‌కు సొంత పార్టీలోనే మద్దతు కరువైందని..దీంతో ఆయన అధ్యక్షతన జరుగుతున్న సమన్వయ సమావేశాలకు కీలక నేతలు డుమ్మా కొడుతుండడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ గెలుపు కష్టమేనని, దానం నాగేందర్ మూడో స్థానానికి పరిమితం అవుతారన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. మొత్తంగా ఈ సారి లష్కర్‌పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



### కాంగ్రెస్‌కు ఓటేస్తే... బీజేపీకి వేసినట్టే..

**మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి**

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్టేనని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎన్నికల ఇన్‌చార్జి బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, రాష్ట్రాన్ని పదేండ్ల కాలంలో అద్భుతంగా అభివృద్ధి చేశారని చెప్పారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నదన్నారు.



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు బొట్టుపెట్టి..హారతి ఇస్తూ..

## పజ్జన్నకు జననీరాజనం

### ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన పద్మారావు

**అచ్చొచ్చిన పార్సీగుట్ట నుంచే..**

**బ్రహ్మరథం పట్టిన ప్రజలు**

**హోరెత్తిన జై తెలంగాణ నినాదాలు**

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 15: పూల జల్లులు.. మంగళహారతులు.. ఇలా అడుగడుగునా..అపూర్వ స్వాగతాల నడుమ పజ్జన్న పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. ప్రతిసారీ తనకు అచ్చొచ్చిన పార్సీగుట్ట నుంచే సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన.. అనంతరం బౌద్ధనగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పజ్జన్న పాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు.. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ఆడపడుచులు హారతులు ఇచ్చి..కారు గుర్తుకే మా ఓటు అంటూ.. స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. పార్సీగుట్ట, సంజీవపురం, అశోక్‌నగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన పద్మారావు ఈ సందర్భంగా మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు, తుకారాం గేట్ ఆర్‌యూబీ నిర్మాణం, సీతాఫల్‌మండిలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, మంచినీటి ఎద్దడి నివారణ, సీవరేజ్ సమస్యల పరిష్కారం.. ఇలా పదేండ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపానని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఏ విధంగా అండగా నిలిచారో.. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లోనూ మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఓ వృద్ధురాలి ఆప్యాయత



ప్రజలకు అభివాదం చేస్తున్న పద్మారావుగౌడ్

## భవన నిర్మాణ వ్యర్థాలా..?

### 'డోర్‌స్టెప్' సేవలు పొందండిలా

**వాట్సాప్ నంబర్**

**9100927073, 7330000203**




సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : భవన నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు 'డోర్‌స్టెప్' సేవలను అందిస్తున్నట్లు బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. పౌరులు తమ భవన నిర్మాణ, పునరుద్ధరణ, మరమ్మతు నుంచి ఉత్పన్నమయ్యే సీ అండ్ డీ వ్యర్థాలను ఇంటి నుంచే తీసుకొని వెళ్లేందుకు నగదు చెల్లింపు సేవలను జీహెచ్ఎంసీ ఆమోదించిన ఏజెన్సీల నుంచి పొందవచ్చన్నారు. వివరాలకు బల్దియా వెబ్‌సైట్ www.ghmc.gov.in, My GHMC App, లతో పాటు వాట్సాప్ నంబరు 9100927073, 7330000203లలో సంప్రదించవచ్చన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి, నీటి వనరులను రక్షించడానికి, వరదలను నివారించడానికి, భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించేలా సుస్థిరమైన స్వచ్ఛ హైదరాబాద్ కోసం నిర్మాణాల కూల్చివేత, వ్యర్థాల నిర్వహణ సజావుగా జరిగేలా ప్రజలు జీహెచ్ఎంసీ ఆమోదిత సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీల సేవలను వినియోగించుకోవాలన్నారు.

## ₹ ఎర్లీబర్డ్‌తో 230 కోట్ల ఆదాయం

### 30వతేదీలోపు ఆస్తిపన్ను రాయితీకి అవకాశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకొని 5 శాతం రాయితీ పొందాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. ఈ నెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ.230 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. గ్రేటర్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత సమయంలో ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు క్యాడర్ లేదు.. బీజేపీకి అభ్యర్థి లేదు

**కంటోన్మెంట్‌కు ఆ పార్టీలు చేసిందేమీలేదు**

**మరోసారి ఎగిరేది గులాబీ జెండానే**

**బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల**



మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 15: కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కులేదని బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం బోయిన్‌పల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కేసీఆర్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్నకు ప్రజలతో మంచి అనుబంధం ఉందని గుర్తుచేశారు. ప్రజలందరి ఆశీర్వాదంతో కంటోన్మెంట్‌లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 30 ఏండ్లుగా కంటోన్మెంట్‌లో సాయన్న చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదని, కుటుంబంలో ఇద్దరిని కోల్పోయిన నివేదితను కంటోన్మెంట్ అక్కున చేర్చుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్‌కు క్యాడర్ లేదని, బీజేపీకి అభ్యర్థి లేడని ఎద్దేవా చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలపైనే బీజేపీ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కంటోన్మెంట్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌కు ఉచిత మంచినీటి పథకాన్ని అమలు చేయడంతో పాటు డబుల్ ఇండ్లు కట్టించి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇటీవల కాలంలో నీటి ఎద్దడిని సైతం ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని, కంటోన్మెంట్‌లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నేడు బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నివేదితను ఆశీర్వదించాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

30 ఏండ్ల ప్రజాజీవితంలో ఉన్నా.. ఉండడానికి సొంత ఇల్లు కూడా సాయన్న కుటుంబానికి లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రజలతో మంచి అనుబంధం ఉన్న సాయన్న కుమార్తె నివేదితను అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఇతర పార్టీలు కూడా నివేదితకు మద్దతివ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బీజేపీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, నేతలు జంపన ప్రతాప్, అమరేందర్‌రెడ్డిలతో పాటు పలువురు నేతలు ఆలోచించుకోవాలని, కలిసికట్టుగా నివేదితకు సంపూర్ణ మద్దతు పలికితే కంటోన్మెంట్ వాసులు హర్షిస్తారని చెప్పారు. డబుల్ ఇండ్లపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, కావాలని కొందరు దళారులుగా మారి ఇష్టానుసారంగా సాయన్న కుటుంబంపై విమర్శలు చేయడం తగదన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

### ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటా..

**కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత**

సాయన్న కుటుంబంపై నమ్మకంతో తనను అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ధన్యవాదాలు తెలిపారు. సాయన్నలాగే తాను కూడా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండు యాదవ్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు హరి, నర్సింహ యాదవ్, ధీననాథ్ యాదవ్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.



## గృహజ్యోతికి షాక్

**వేసవిలో లబ్ధిదారులకు బిల్లుల మోత**

**మార్చి నెలలో గిర్రున తిరిగిన మీటర్లు**

**ఏప్రిల్, మేలోనూ ఇదే తీరు**

**21 సర్కిళ్లలో 36 లక్షలు మంది అర్హులు**

**10 లక్షల మందికి 200 యూనిట్లు దాటిన కరెంటు బిల్లులు**

సిటీబ్యూరో: గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు బిల్లుల షాక్ తగిలింది. మార్చి నెలలో విద్యుత్ మీటర్లు గిర్రున తిరిగేశాయి. ఫలితంగా 200 యూనిట్ల లోపు ఉండాల్సిన కరెంటు వినియోగం కాస్తా 250 నుంచి 300 యూనిట్లు దాటింది. దీంతో అంతకు ముందు గృహజ్యోతి పథకానికి అర్హులుగా గుర్తించిన వారిలో సుమారు 10 లక్షల మంది ఒక్కసారిగా నిరుత్సాహానికి గురయ్యారు. మార్చి నెల నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే వారికి 'గృహజ్యోతి' అమలు చేసేస్తామని ప్రకటించిన తర్వాత రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మరోవైపు మార్చి నెలలో విపరీతమైన ఎండల కారణంగా విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరిగింది. ఫలితంగా 200 యూనిట్లలోపు రావాల్సిన కరెంటు బిల్లులు ఒక్కసారిగా మోతమోగడంతో గృహజ్యోతి లబ్ధిదారులు నిరాశచెందారు.

### మొత్తం 21 సర్కిళ్లలో..

టీఎస్ఎస్‌పీడీసీఎల్ పరిధిలో మొత్తం 21 సర్కిళ్లు ఉండగా, అందులో సుమారు 36 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. వీరందరికీ మార్చి నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసేందుకు మీటర్ రీడింగ్‌లో 200 యూనిట్ల కంటే తక్కువ వచ్చిన వారందరికీ ఫిబ్రవరి నెలకు సంబంధించి జీరో బిల్లులు జారీ చేస్తూ వచ్చారు.అదే సమయంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆయా జిల్లాల్లో జీరో బిల్లులు ఇవ్వలేదు. మార్చిలో మధ్యలోనే పార్లమెంటు ఎన్నికల కోడ్ రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. దీంతో గృహజ్యోతి అమలు ఎక్కడిది అక్కడే అన్నట్లు నిలిచిపోయింది.

### మూడు నెలలు ఆగాల్సిందే..

ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్లలో 60.80 లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. అందులో గృహజ్యోతి లబ్ధిదారులు గ్రేటర్‌లోనే అధికంగా ఉన్నారు. ప్రస్తుతం ఏప్రిల్ మొదటి వారంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. 2వ తేదీన 83.84 మిలియన్ రికార్డు యూనిట్లు నమోదయ్యాయి. మే నెల సైతం ఇంతకు మించి ఉండే అవకాశం ఉంటుందని.. సుమారు 90 మిలియన్ యూనిట్లు దాటుతుందని అంచనా వేశారు. ఇలా విద్యుత్ వినియోగదారులకు బిల్లులు మోత మోగుతుండగా, గృహజ్యోతి లబ్ధిదారులకు ఈ మూడు నెలలు ఉచితం దక్కనట్లేనని చెప్పవచ్చు.

**టీఎస్ఎస్‌పీడీసీఎల్ డిస్కం పరిధిలో..**

మొత్తం కనెక్షన్లు (21 సర్కిళ్లు) -1.13 కోట్లు



జీహెచ్ఎంసీ పరిధిలో (9 సర్కిళ్లు) మొత్తం విద్యుత్ కనెక్షన్లు - 60.80 లక్షలు

మొత్తం డిస్కం పరిధిలో గృహ జ్యోతి పథకం లబ్ధిదారులు సుమారు - 36 లక్షల మంది